# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 11-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడేలా చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును భారతీయ రైల్వే అందుబాటులోకి తీసుకువచ్చిందన్న కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ.**

3. **గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆక్వా రైతులు  ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన మత్స్య పశుసంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు.**

4. **కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించడంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్.**

==========================

ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న జిల్లాల కలెక్టర్ల సదస్సులో  ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో  ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, స్థూల రాష్ట్ర ఉత్పత్తి- జీఎస్డీపీ వృద్ధి, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, జల భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

--------------------------

రాష్ట్ర బడ్జెట్ పై  త్వరలో అన్ని జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు బడ్జెట్ అంశాల గురించి వివరిస్తామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అమరావతిలోని  సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఆయన ఈ రోజు  మాట్లాడుతూ, బడ్జెట్ అంశాలను  క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరలోనే ఈ కార్యక్రమానికి సంబంధించి తేదీలు ఖరారు చేస్తామన్నారు. ఈ లోపు ఆయా జిల్లాల వారీగా బడ్జెట్ కేటాయింపులు  చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే

ఆర్థిక సంవత్సరం అసాధరణ వృద్ధి సంవత్సరంగా నిలవనుందని  మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను ఈశాన్య భారతంతో అనుసంధానిస్తూ చర్లపల్లి–కామాఖ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును భారతీయ రైల్వే అందుబాటులోకి తీసుకువచ్చిందని  కేంద్ర  ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందిస్తూ,  భారతీయ రైల్వే ఆధునిక సాంకేతికతతో ఈ అమృత్ భారత్ ఎక్ ప్రెస్ ను  తీసుకువచ్చిందని చెప్పారు. ఈ రైలు ద్వారా  పశ్చిమగోదావరి జిల్లా  నుండి రాజమహేంద్రవరం, విశాఖపట్నంకు  వెళ్లే వారికి, ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణం సాధ్యమవుతుందని వెల్లడించారు.  ఈ నెల 13వ తేదీన ప్రారంభమైయ్యే  రైలు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

అనకాపల్లి జిల్లాలోని  నర్సీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ  టీకా  కార్యక్రమాన్ని రాష్ట్ర శాసనసభాపతి  చింతకాయల అయ్యన్న పాత్రుడు ఈ రోజు  ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రశాంతి 14 నుంచి 15 ఏళ్ల వయసున్న 30 మంది బాలికలకు టీకాలను ఇచ్చారు. ఈ సందర్భంగా శాసనసభాపతి  అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నుంచి మహిళలను రక్షించేందుకు ఈ టీకా  కార్యక్రమాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకాను వేయించాలని సూచించారు.

---------------------------

గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆక్వా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి ప్రాధికార సంస్థ – APSADA అధికారులతో దృశ్య మాధ్యమం విధానంలో విజయవాడ నుంచి ఈరోజు సమావేశాన్ని నిర్వహించారు. ఈ  సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మధ్యప్రాచ్య దేశాలకు భారత సముద్ర ఆహార ఎగుమతులు కేవలం 3 నుంచి 4 శాతం మాత్రమేనని తెలిపారు. ఇతర దేశాలకు సముద్ర ఆహార ఎగుమతులు యథావిధిగా కొనసాగుతున్నాయని,  కంటైనర్ల కొరత ఉందన్న వార్తలు అవాస్తవమని స్పష్టం చేశారు. అమెరికా మార్కెట్‌లో త్వరలో రొయ్యల డిమాండ్ పెరిగే అవకాశం ఉందనిఎగుమతుల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

---------------------------

కార్మికులకు  ఆరోగ్య భద్రత కల్పించడంలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ –ఈఎస్ఐసి కీలక పాత్ర పోషిస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. విజయవాడలోని  ఈఎస్ఐసి ప్రాంతీయ కార్యాలయం 75వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన నిన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చే అంశం పరిశీలనలో  ఉందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపీయస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతి ఉంటుందని తెలిపారు. హాల్ టికెట్ చూపిస్తే విద్యార్థులకు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారని తెలిపారు. ఇలా ఉండగా.. రాష్ట్ర వ్యాప్తంగా 6.42 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే ఈ పరీక్షలకు, మొత్తం 3 వేల 415 పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

---------------------------

ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపి సూచించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పోలీస్ అధికారులతో ఈరోజు నిర్వహించిన ప్రాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజీ చేసుకోదగిన అన్ని క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 33 బెంచీలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

రాష్ట్రానికి ఆదాయం తగ్గి, ఖర్చులు పెరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, దాదాపుగా .20 వేల కోట్ల అప్పులను, వాస్తవంకంటే ప్రభుత్వం తక్కువ చేసి చూపుతోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ ప్రభుత్వం విఫలమైందని జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

తిరుపతి అవిలాల చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ –తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుడా ఆధ్వర్యంలో వ్యర్థాల తొలగింపు పనులను పూర్తి చేశామని తెలిపారు. సుమారు 157 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు సంబంధించి 14 మీటర్ల వెడల్పుతో గట్టు నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. అలాగే తిరుపతి నగరంతో పాటు చుట్టుపక్కల ప్రజల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, క్రీడా ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

---------------------------

రైతులకు, భూ యజమానులకు రాజముద్ర, క్యూ ఆర్ కోడ్ లతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పి. రామాంజనేయులు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో జరిగిన గ్రామ సభలో నూతన పాస్ పుస్తకాలను ఆయన ఈరోజు రైతులకు అందజేసారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ, కొత్త పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ద్వారా భూముల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని వీటిని ట్యాంపరింగ్, నకిలీ చేయడం సాధ్యపడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర ఉండటం ద్వారా బ్యాంకు రుణాలను పొందవచ్చని తెలిపారు.

=====================